

# గోరంత దీపం

వెల్చేటి సుబ్రహ్మణ్యం

## ఏడువారాల నగల్లో ఇది అయిదవది

"ఒరారేయ్, అచ్చిగా! నిజంగానే పగలైపోతదా?"

"ఒరి నీ యవ్వ! నీ అనుమానంతో మా పేనాలు తోడేత్తున్నావురా!"

"ఒరయ్యో! నే నియ్యాల మం దెనకా లెల్లనేయ్!"

"బాబుగారూ! ఇయ్యాల బొద్దేళకి చే న్నుండి వచ్చేత నండీ!"

"ఏటేవ్, పిల్లా! బారెడు పొద్దుండగానే మోపు కట్టేత్తున్నావ్! నందేళక్కదా నందడి."

"సాల్లే బడాయి! ను వ్వెందుకంట ఇంత బేగ గట్టెక్కేసినావ్? ఇయ్యాల్నుంచి మనక సీకట్లో సైగలకి మంగలారతే."

ఊరంతా ఒకటే హడావుడి. అనలు ఈ రోజేంటి - వారం రోజుల్నుంచీ ఊళ్లో ఏ నోట విన్నా ఇదే ప్రస్తావన. అందరికీ ఒకటే ఆతృత. సంధ్యవేళయితే బావుణ్ను. ఒకటే కోలాహలం.

ఆ రోజు సాయంత్రం మా ఊళ్లో కరంటు దీపం వెలుగుతుంది. అదీ సంగతి. 'ఓస్ ఇంతేనా' అని ఇవ్వుడు మీ కనిపించవచ్చును గానీ, ఆ రోజు అది ఎంత సంబరవో మీ రుంటే గాని నమ్మలేరు.

మా ఊరి నాలుగు వీధుల కూడలిలో కరెంటు స్తంభం పాతారు. తూరుపున రామ కోవెల, దాని కెదంగా మునసబు గారి మేడ, దానికి వోరగా కరణంగారి వసారా, దా న్నానుకుని పూజారిగారి పెంకు టిల్లు. పశ్చిమాన షావుకారు సుబ్బయ్య దుకాణం, పక్కనే అంగడి, దక్షిణాన కొన్ని పెద్ద గడపలు. ఉత్తరాన కుమ్మర్లు, వడ్రంగులు, సాలీలు ఇంకా ఇతర వర్ణాల వారుండేవారు. ఊరిని అనుకునే సెలయేరు. ఏటి కావల మావి తోపుల నడుమ మిట్టపై శివాలయం. ఊరు చిన్నదే కాని కట్టుబాటుకి పెద్దది.

మునసబు నాయుడు మా దొడ్డ మనిషి. ఓ వంద ఎకరాల ఆసామి. ఏదైనా పదిమందికి పనికొచ్చేది ఉందంటే మా ఊళ్లో ఉండాల్సిందే. ఖర్చు ఎంతైనా పరవాలేదు. "తల్లి భూదేవి చల్లగా ఉండాలి గాని, ఇ దేపాటి ఖర్చు!" అనేవారు. ఇదిగో వారి చలువ వల్లనే మా ఊరికి కొంసెదు దూరంలో వెళ్లిపోయే తీగల్ని స్వంత ఖర్చుల మీద మా ఊరికి మళ్లించి, వా రింట్లో కంటే ముందుగా నాలుగు వీధుల కూడలిలో దీపం పెట్టించారు. ఆరోజు దీపం పెట్టడానికి వచ్చిన సర్కారీ వారితోపాటు ఊరందరికీ వా రింట్లోనే భోజనాలు ఏర్పాటు చేశారు.

స్తంభానికి పసువు రాసి, బొట్లు పెట్టారు. మావిడాకులు కట్టారు. స్తంభానికి నాలుగు పక్కలా తోరణాలు కట్టారు. కరణం గారి భార్య సుభద్రమ్మ గారు పళ్లెం పట్టుకుంటే మునసబు గారి ఇల్లాలు వర్ధనమ్మగారు హారతి వెలిగించారు. అంతే! గుప్పెడు బల్బు నుండి పుట్టెడు వెలుగు ఒలికిపోయింది.

వెలుగు! వెలుగు! రామ కోవెల మండపంలో సీతమ్మ వారి చూపులా చల్లగా ప్రసరించింది వెలుగు! మునసబు గారి మేడ వరండాలో ఠీవిగా పచార్లు చేసింది వెలుగు! కరణం గారి వసారాలో చాపలా పరుచుకుంది వెలుగు! పూజారి గారి కిటికీలోంచి నడవాలోకి తొంగి చూసింది వెలుగు! సుబ్బయ్య త్రాసు ముల్లుపై సూటిగా పడింది వెలుగు! పెద్ద గడపలపై రాబుగా మెరిసింది వెలుగు! చిన్న వాసాల్లోకి నేరుగా పాకింది వెలుగు! అంగట్లో కళకళలాడింది వెలుగు! మా ఊరిపై వెన్నెల గొడుగు పట్టింది వెలుగు!

ఓ! కేరింతలు, ఈలలు మిన్ను ముట్టాయి. ఝుఝునక ఝునక అంటూ

డవ్వున దరు వేశాడు బారికి గంగులు.

"బుర్రంటే తెల్లోడిదేరా! ఏటి! నూ న్నేదు, వొత్తి నేదు తీగ మీద దీవం ఎలిగిపోనాది."

"ఓ రంతే గాదేయ్! వానొచ్చి నార దంటాయ్!"

"అవును గా న్రరేయ్! తీ గంటుకుంటే కరుస్తా దని వంతులుగోరు సెప్పారు. నిజమా!"

"ఓరి నీ యవ్వ! అనుమాన పెదవ అంటుకున్నావ్ గనకరేయ్!"

"బాబుగారూ! మన కర్రావు పొదుగు దించీసినాది గదా! ఇక మాపటేళ ఈనినా వర్నేదండి. గుడ్డి దీవం ఎట్టుకుని హైరాన పడిపో అక్కర్నేదండి!"

"తాతగారూ! వరండాలో వడక కుర్చీ వేసుకుని ఇక మీరు రాత్రి కూడా భారతం చదువుకోవచ్చు."

"తాతయ్యా! నువ్వు రోజూ రాత్రయిపోయింది, ఇక వడుకోండి మిగతా కథ రేవు వెలుగొచ్చాక చెబుతా నంటావు కదా! ఇక తీగ దీవం ఉంది. రాత్రంతా వెలుగే! రాజకుమారిని ఎత్తుకుపోయిన మాయల ఫకీరును రాజకుమారుడు చంపేసేదాకా కథంతా చెప్పెయ్యాలి."

"ఛ! ఛ! అ దేం కాదు. రాత్రివేళ అలాంటి దెయ్యాల కథలు వినకూడదు. కల్లో కొచ్చేస్తాయి కదూ, తాతయ్యా!"

"ఎదు రింటి గాయత్రి, నేను కలసి చీకటి వడ్డాక కూడా ఎంచక్కా తొక్కుడు బిళ్ల ఆడుకుంటాం."

"పోవే బడ్డూ! నేను, కిట్టవ్వ, సూరిగాడు అందరం కలసి తీగ దీవం కింద దొంగా - పోలీస్ ఆడుకుంటాం."

"చూడు, తాతయ్యా! వీడు నన్ను బడ్డూ అంటున్నాడు. నేను వీడ్ని పొడుంకాయంటే మాత్రం కొడతాడు మరి."

"ఇంకేటి సుబ్బయ్యకి నూనె ఖర్చు మిగులే!"

"సుబ్బయ్యా! గుడ్డి దీవంలో సేసినట్టు ఇక మాపటేళ తూకంలో తిరకాసు కుదర్దు."

"ఇంకేటి అమ్మోరి జాతరకి దివిటీ లక్కర్నేదు. కొత్తమన రేతిరి కూడా ఎన్నెల ఎలుగే!"


ఇలా ఒకటే మాట. ఎవరి నోట విన్నా తీగ దీవం మాటే.

అవును మరి, ఆ వీ ధ్దీవం వెలుగులో నారాయణదాను గారు హరికథలు చెప్పారు. ఆ వీ ధ్దీవం కిందనే స్థానం వారు, వేమూరి గగ్గయ్యా ఎందరో మహానుభావులు నాటకా లాడారు. అక్కడే గొల్లసుద్దులు చెప్పారు. భామాకలాపం ఆడారు. మా ఊరు మీదుగా వెళ్లిపోతూ గాంధీ గారు ఆ వీధి దీవం కిందనే నిలబడి ఉపన్యాసం ఇచ్చారు. ఆ వీ ధ్దీవం కింద చదువుకునే ఎందరో పెద్దో ళ్లయ్యారు. అప్పుడు అది ఒకటే దీవం అయినా ఊరంతా వెలుగే. మరి ఇప్పుడు ఊరంతా దీపాలే కానీ ...?

★




## 'ఆంధ్రప్రదేశ్' అను గుడ్డి దర్బారు లీలల మీద గరమ్ గరమ్ కాలమ్



### మాట వేరు-చేత వేరు

వ్యవసాయ కూలీల్లో-

గర్భిణీ స్త్రీలకు సహాయం కోసం పది కోట్లు కేటాయించిన విషయం ముఖ్యమంత్రి ఘనంగా చెప్పుకుంటూంటారు. అక్కడికి అదేదో కొత్త పథకం ప్రవేశపెట్టినట్లు!

ఇది కొత్తదేమీ కాదు; పాత చింతకాయ పచ్చడే! 1985-86లోనే అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 1989-90 వరకూ అమలు పరిచారు. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ కూలీ కుటుంబాల సంఖ్య అనేక లక్షలు. ప్రభుత్వం ఇచ్చిన సహాయం 91 వేల మందికే- అంటే సగటున సంవత్సరానికి 14 వేల మందికి. అందులో సగం మందికి ఆ సహాయం అవసరం తీరిపోయిన తర్వాత, అంటే పురుడు పోసుకున్న తర్వాత డబ్బు పంపారు. వారిలో సుమారు ఆరువేల మనీఆర్డర్లు తిరిగి వచ్చేశాయి. తూర్పు గోదావరి జిల్లాలో 21 వేల మందికి మనీఆర్డర్లు పంపితే 1530 మంది నుంచి తిరుగు రసీదులు కూడా రాలేదు. అంటే వారికి పంపిన రు. 1.36 లక్షలు అందాయో, లేదో తెలియదు. కొన్ని జిల్లాల్లో డబ్బు ముట్టిందో, లేదో అనే విషయం కూడా అధికారులు పట్టించుకోలేదు.

ఈ పథకం అమలు పరచడంలో ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ఉందో తెలుసుకోవాలంటే ఇది చదవండి.

చిత్తూరు, తూర్పు గోదావరి, కర్నూలు, విశాఖపట్నం- కేవలం నాలుగు జిల్లాల్లోనే రు. 54 లక్షల రూపాయలు సంవత్సరం అఖరున మార్చి నెలలో విడుదల చేశారు. అది కూడా బడ్జెట్ కేటాయింపు అయిపోయి, అది తీసుకోకపోతే మురిగిపోతుందని తీసుకున్నారు. ఆ తర్వాత ఎపుడో ఆ డబ్బు మనీఆర్డర్లు చేశారు.

డబ్బు పంపడంలో ఇంత ఆలస్యం ఎందు కైందని అడిగితే మనీఆర్డర్లు రాయడానికి ఉద్యోగులు చాలినంత మంది లేరు, పైనుంచి నిధులు రాలేదని జవాబు! ఉదాహరణకు మార్చి '86లో డబ్బు తీసుకుని మరుసటి సంవత్సరం అక్టోబర్ వరకూ డబ్బు పంపిస్తూనే ఉన్నారు.

వి. హనుమంతరావు